# టిక్... టిక్... టిక్...

## దోరవేటి

"తాతాచార్యుల తద్దినానికీ పీర్ల పండుగకూ ఏం సంబంధంరా?" ఒకింత విసుగుతో అన్నాన్నేను.

నా పరామర్శ వానికి నవ్వు తెప్పించినా, తాను చెప్పే విషయం సత్యమేనన్నట్లు చెప్పసాగాడు డాక్టర్ మధు–

"రమణా! ఆరోగ్యానికీ ఆనందానికీ సంబంధం ఉందిరా. అందుకే వైద్య శాస్త్రంలో, బోధనా రంగంలో మానసిక శాస్త్ర అధ్యయనం తప్పనిసరి. దాన్ని సరిగ్గా అనుసరించగలవాళ్ళే వృత్తిలో రాణిస్తారన్న సంగతి నీకు మాత్రం తెలీదా?"

"ఓహో! అట్లా నరుక్కొచ్చావా? 'ఒకందుకు పోస్తే ఒకందుకు తాగినట్లున్నది' సరేలే! చెప్పు... చెప్పు!" అన్నాను ఆసక్తిగా.

"నిజం చెప్పాలంటే నీకే జబ్బూ లేదురా. కొన్ని ఆరోగ్యసూత్రాలు పాటిస్తే చాలు. హాయిగా 'శతమానం భవతి!'" అన్నాడు ఆశీర్వదిస్తున్నట్లు నటిస్తూ చిరునవ్వుతో.

"బావుందిరా. 'కాశీకి పోయి కల్లుముంత దెచ్చుకు'న్నట్లు స్నేహితుడవు, వైద్యుడవు. మంచి మందులిచ్చి నా జబ్బులు మాయం చేస్తావనుకుంటే అసలు మందులే అవసరం లేదంటావా? ఒకటా రెండా? కడుపు నొప్పి, కాళ్ళు నొప్పి, తలనొప్పి.... అన్నిటికీ మించి గుండెల్లో నొప్పి. ఇన్ని సమస్యల్తో వస్తే – ఇట్లా తీసి పారేస్తావా? అవున్లే. ఎద్దుపుండు కాకికి నొప్పా?" నిష్ఠూరం ధ్వనించింది నా కంఠంలో.

ఒక్క పెట్టున నవ్వేశాడు వాడు.

"నిజమేరా. నీవన్నట్లు పది టెస్టులు జేసి, ఇరవైవేల బిల్లు నీ నెత్తిన రుద్ది. నాలు గింజక్షన్లు గుచ్చి, వంద రూపాయల కొకటి చొప్పున ఓ వంద మాత్రలు రాసిస్తే నీ కప్పుడానందంగా, తృప్తిగా ఉండేది. మానవ జీవన శైలే అట్లా తయారైంది. నిన్ను వేరే అనడం ఎందుకులే. నాకు తెలుసు. నీకే సమస్యా లేదు. ఉన్న సమస్యలు చాలా తేలికైనవే. అందంగా ఉన్నావ్. ఆనందంగా ఉండు. ఆరోగ్యం అదే సర్దుకుంటుంది.

"నీ కడుపు నొప్పికి కారణం అజీర్తి. సకాలంలో తినవలసినంత తినక పోవడం. నీళ్ళమోతాదు సరిగ్గా తీసుకోకపోవడం. సరైన విశ్రాంతి లేకపోవడం... అన్నిటికీ మించి మలబద్ధకం... రోజూ ఉదయం లేవగానే లీటరుకు తగ్గకుండా మంచి నీళ్ళు తాగు. నడక వ్యాయామం క్రమం తప్పకుండా చేయి. పగటిపూట నిద్రపోకు. రాత్రి తొందరగా తిని, తిన్నాక గంటాగి నిద్రపో. ఇదిగో! నీ తృప్తికోసం ఈ మాత్రలు" అంటూ చీటీ రాసిచ్చాడు.

చీటీ అందుకుంటూంటే అన్నాడు మళ్ళీ–

"నిన్ను నీవు తెలుసుకునే ప్రయత్నం చేయి అది నీకు కొత్త ఉత్సాహాన్నిస్తుంది".

"ఏంటీ, అదొగటుందా? ఈ తత్వశాస్త్రం ఫిటింగేంటి' బట్టతలకూ మోకాలికీ జత గలిపినట్టు?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఒరేయ్! భారతీయ జీవన విధానమంతా ఆధ్యాత్మికతతోనే ముడిపడి ఉంటుందిరా. నిన్ను నువ్వు తెలుసుకునేందుకు ముక్కుమూసుకొని తపస్సే చెయ్యనవసరం లేదు. రోజూ నువ్వు చేస్తున్న పనులవల్ల ఎంతమందికి అపకారం జరుగుతుందో తెలుసుకో. అట్లా జరిగే పనుల్ని చేయకుండేందుకు ప్రయత్నించు. అంతే..." తేలికగా వివరించాడు.

"ఓహో! ఇదేదో బాగానే ఉందే. 'కంతలో తలదూరిస్తే కంకణం తగులుకున్నట్టు' సరే. నీ సమయాన్నీ వృథా చేయడమెందుకు వస్తా మరి... అయ్యో! వైద్యుల వద్ద అనకూడని మాట అనేశానే. ఐనా పెదవిదాటిన మాట వెనక్కి వస్తుందా?" నిట్టూరుస్తూ లేచాను.

చికిత్సాలయం (క్లినిక్) నుండి బయటపడ్డాక చాలా తేలికగా అనిపించింది. 'నిజంగా నాకే జబ్బూలేదా?' ఆ మాట తలచుకుంటూంటేనే ఎంతో హాయిగా ఉంది ప్రాణానికి. 'నయాపైసా ఖర్చులేని సూత్రాలు చెప్పాడు. ఇంత తేలిగ్గా రుగ్మతలు తగ్గుతాయా?' అన్న అనుమానం కూడా వచ్చింది. కాని, స్నేహితుని మీద నమ్మకం బలమైంది. 'నన్ను నేను తెలుసుకోవా'లనే కొత్త సూత్రం గుర్తుకు రాగానే మనసుకు గిలిగింతలు కలిగాయి.

'నేను చేస్తున్న పనివల్ల ఎదుటి వాళ్ళకు అపకారం వాటిల్లకపోతే నేను మంచి వాడన్నట్లే. ఇప్పటికే అంతా తనను 'మంచివాడు'గా గుర్తించారు. కొందరు విద్యార్థులకు, అసూయపరులైన సహాధ్యాపకులకు, మరికొందరు పొరుగింటి 'చేదు' కూరలకు ఆ వర్గంలో స్థానం లేకపోవడం అప్రస్తుతం. అది సరే. నిజంగా మనం చేస్తున్న పని వల్ల ఎదుటి వాళ్ళకు అపకారం జరుగుతుందో లేదో, ఎంత మాత్రమో ఇప్పటినుంచీ గమనించాలి' అనుకుంటూ ఇల్లు చేరాను.

"ఏమండీ! డాక్టరు గారేమన్నారు?" ఇంట్లో అడుగు పెట్టగానే శ్రీమతి ఆదుర్దా.

"ఆ ఏమంటాడు? 'తిన్నావా? పడుకున్నావా? తెల్లారిందా?' అని అడిగాడు. అని వెటకరించి, "మొహం



జూడు మొహం నీలాంటోడ్నే ఏరా ఎర్రిపీనుగా అని మందలిస్తే, 'నా పేరు పీనుగా కాదండీ, అందరూ సీనుగా అంటారు' అని సర్ది చెప్పాడట. డాక్టరేమం టాడు?.... ఆc....! ఏమనాలో అదే అన్నాడు'' అని కసురు కొని, బట్టల మారకాని (డ్రెస్ ఛేంజ్)కి ఉపక్ర మించాను.

''ఆc! మీరు జెప్పనంతమాత్రాన నాకు తెలీదనుకో కండి. ఏ జబ్బూలేదు, శుభ్రంగా తిని, తగినంత విశ్రాంతి తీసుకుంటే అన్నీ సర్దుకుపోతా'యని ఉంటాడు'' అని తన కార్యక్షేత్రంలో లీనమైంది.

ఉలిక్కిపడ్డాన్నేను. ఇదేంటీ సంజయుడు కురుక్షే త్రాన్ని జూచినట్లు ఇది ఇక్కడ్నుంచే అంతా చూసేసిన ట్లుందే! కొంపదీసి విభీషణుడు రామునికి ఉప్పందించి నట్లు ఆ డాక్టరు గాడికి దూరవాణి ద్వారా అన్నీ చేరవే సిందా ఏం?'' అనుకుంటూనే డాక్టరు చెప్పిన అంతర్మధ నంలో పడ్డాను.

సాయంత్రం రాత్రి కింద పరిణామం చెందింది. మందు, భోజనం, కాలక్షేపాలు దాటి పడకసీనులో ప్రవే శించాను. మెదడంతా గజిబిజిగా తయారైంది.

మంచీ-చెడును బేరీజు వేసుకోవడం కోసం ఏదైనా ఒక పద్ధతి అవలంబించాలి... బాగా ఆలోచిస్తే గుర్తొ చ్చింది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకోసం అభ్యర్థన పత్రం లాగా అంశాల వారీ జాబితా తయారుచేసుకో వాలి' ఆ ఆలోచనరాగానే లేచి అదేదో రాసేసుకోవాలని పించింది. కాని, 'అద్దమ్మ రాతిరి లేచి పెద్దమ్మా' అన్నట్లు ఇదేంటండి' అని శ్రీమతి 'సుత్తిమాల' మొదలు పెడ్తుం దేమోనన్న భయంతో ఆ సాహసానికి పూనుకోలేక, అటూ ఇటూ కదల సాగాను.

''ఏంటండీ ఆ మసలటం? ఇదివరకు పదకొండు దాటితే కదలకుండా పడుకునే వారు. ఇప్పుడు 'చదవేస్తే ఉన్నమతి పోయిం'దన్నట్లు వైద్యం చేయించుకుంటే కొత్తజబ్బులు మొదలయ్యాయా ఏం?'' అని విసు క్కుంటూ అటు తిరిగి పడుకుంది.

తను మసలటం అధికం గావడంతో మన కదలిక లాగిపోయాయి మరి.

రాత్రనుకున్న పని ఉదయం సాధించేందుకు కుదర లేదు. కళాశాలలో విరామ సమయంలో తీరిగ్గా ఆ పని కుపక్రమించాను. ఇతరుల కుపకరించిన పనులు. జాబితా వ్రాస్తూ, ప్రతి పని చివర (✓) చేయసాగాను ఇలా-

1. ఉదయమే నిద్రలేవడం (✓)
2. కాలినడక వ్యాయామం చేయడం (✓)
3. నా ఇంట్లోనే అల్పాహారం చేయడం (✓)
4. రోడ్డు నిబంధనల ననుసరించి బండి తోలడం (✓)
5. సకాలంలో కళాశాల చేరడం (✓)
6. విద్యార్థులకు సక్రమంగా పాఠాలు చెప్పడం(✓)
7. తోటివాళ్ళతో కలిసి భోం చేసినా, నా పదార్థాలే నేను తినడం (✓)
8. ఎవరి వద్దా అప్పులు చేయక పోవడం (✓)
9. ఎవరినీ నొప్పించే మాటలు మాట్లాడకుండటం (✓)
10. సాయంత్రం ఇంటికెళ్తూ మద్యం నాలుగోభాగం (క్వార్టర్) సీసా పట్టుకెళ్ళడం (✓)
11. నా ఇంట్లో నేను కూర్చొని, మా ఆవిడ చేసిచ్చిన అనుపానాలతో కొంచెం మద్యం సేవించడం (✓)
12. దృశ్య శ్రవణ మాధ్యమం (టీవీ)లో నాకిష్టమైన వాహినులు (ఛానల్స్) చూడటం (✓)
13. నిద్రరాగానే పడుకోవడం (✓)

ఇలా... నేను చేసే మంచిపనులన్నీ అక్షరబద్ధం చేస్తూంటే నాకిదేదో మహాద్భుతంగా అనిపించసాగింది. అసలు మొదటినుండీ నా దినచర్య వ్రాసుకుంటే, అది ఒక 'ఆదర్శ పురుషుని జీవిత చరిత్ర' అనే పేరుతో గొప్ప గ్రంథం తయారై ఉండేది. దాంతో ఎంతో పేరు, కీర్తి, డబ్బు....

''రమణ సార్! మన మల్లికార్జున్‌తో ఎవరో గొడవ పడ్తున్నారు. చూద్దాం పదండి...!'' ఆర్థిక శాస్త్రాధ్యాప కుడు అమరలింగం మందలింపుతో ఈ లోకంలో పడ్డాను.

నేను వెళ్ళే సరికి గొడవ చరమాంకంలో పడ్డట్టుంది.

''ఓయ్! గదంతా మాకు దెల్వద్. నెలకు ఏడు వేలు గట్టాలె. ఫైలి రాంగనే వచ్చి కూసుంటం. ఇయ్యలేద నుకో.... అప్పుడు మాటలుండయ్... యాదుంచుకో!'' వాళ్ళదైన పద్ధతిలో హెచ్చరించాడు వచ్చిన వాళ్ళలో నాయకునిలాంటి వాడు మల్లికార్జున్ సర్‌ని. వాళ్ళంతా 'అప్పిచ్చువాని' సంబంధ కింకరుల్లా ఉన్నారు.

మల్లికార్జున్ మొహం తెల్లగా పాలిపోయింది.

లోపలికొచ్చాక అధ్యాపక వర్గమంతా అతనికి హిత బోధ చేయసాగారు.

''ఎందుకు సార్. అనవసరంగా మంది పంచాత్‌లల్ల తలకాయ్ బెట్టరు?'' మితంగా మందలించాడు ఇంగ్లీషు ఉపన్యాసకుడు హిదాయతుల్లా.

''పాపం పేదవాడు సార్. అమ్మాయికి మంచి సంబంధం కుదిరింది. అప్పు చేస్తే ష్యూరిటీ ఇచ్చాను అంతేగదా!'' జరిగిన అవమానం ఛాయ అణుమాత్ర మైనా మల్లికార్జున్ మాటల్లో కనబడలేదు.

''ఎందుకు తప్పులేదు? ఆ అటెండర్ రాములు గాడు నీకొక్కనికే దెలుసా? మాకంతా దెలుసు. ఇటువంటి సమస్యలొస్తాయనే గదా! మేమెవ్వరమూ షూరిటీ ఎందుకివ్వలేదు మరి?'' వ్యంగ్యం ఒలికించాడు వరద రాజు, జంతు శాస్త్రాధ్యాపకుడు.

''ఈ మల్లికార్జున్ పనులన్నీ ఇలాగే ఉంటాయి సార్. పోయిన నెల రోడ్డు మీద కాలేజీ అమ్మాయిని ఎవరో రౌడీలు ఏడిపిస్తున్నారట. ఘర్షణ సినిమాలో హీరో వెంక టేష్ లాగా ఈయనగారు ఎంట్రీ ఇచ్చారు''. అదేమన్నా సినిమానా? పాపం! సున్నంలోకి ఎముక మిగలకుండా కుమ్మేశారు... ఆ వెధవలు'' అందరూ లోలోపల నవ్వు కున్నారు. కొందరు బయటికిక్కూడా. అడపా దడపా ఆ విషయం జరిగిన నాటినుండీ గుర్తు చేస్తూనే ఉన్నాడు ఉమాకాంత్‌రావు.

''తాదూర కంతలేదు, మెడకో డోలన్నట్లు ఈయనకే గడవటం కష్టం. ఓ వీధి బాలుడ్ని ఇంట్లో తెచ్చి పెట్టుకు న్నాడు - ఉద్ధరిస్తానని ....'' సాయినాథ్ మాట పూర్తికా లేదు.

''చూస్తూండండి. వాడేదో మంచి ముహూర్తం చూసుకొని ఆషాఢ భూతిలాగా అన్నీ సరద్దుకొని ఉడా యించేస్తాడు...'' తెలుగు అధ్యాపిక దీప్తి శిఖ ముక్తా యింపు నిచ్చింది.

ఎవరో ఒకరు ఏదో ఒకటి అట్లా 'జాలి' వాచకాలు వల్లెవేస్తూనే ఉన్నారు. ఆ 'జాలి'లో దెప్పిపొడుపే గాని, సహానుభూతి అణుమాత్రం కూడాలేదని అర్థమవు తూనే ఉంది. నేను అందరిలా అతడ్ని గాయపరచదలు



చుకోలేదు. 'ఊరంతా ఒక దారి, ఉలిపిరి కట్టెదో దారి' అని నా గురించి ఎవరన్నా అనుకున్నా నాకు బాధలేదు. ఆదర్శవంతమైన జీవనం గడుపుతున్నప్పుడు అట్లా ఎద్దేవా చేసే వాళ్ళూ, కుళ్ళుకునే వాళ్ళు ఉంటుంటారు. వాళ్ళను గురించి పట్టించుకోగూడదు. పాపం మల్లికార్జు న్‌ని చూస్తే జాలిగా ఉంది. అతడ్ని నాదైన పద్ధతిలో ఓదార్చేందుకు నిర్ణయించుకున్నాను. సాయంత్రం కళా శాల నుంచి బయలుదేరేటప్పుడు నాతోపాటు ఇంటికి తీసుకొచ్చాను. మందు విందు (కమ్మని నోరూరించే అనుపానాలతో) ముందుంచాను.

'పిలిచి పిల్లనివ్వబోతే అలిగి ఎలుగుల పడ్డట్టు' నా అభ్యర్థన తిరస్కరించాడు నవ్వుతూనే మల్లికార్జున్. కనీసం కూల్‌డ్రింక్ కూడా ముట్టలేదు. 'ఇంత చప్పటి జీవితం అనుభవిస్తున్నాడు కాబట్టే ఎవరేమన్నా నోరు మెదపని మన్నుదిన్న పాములా జీవితం గడుపుతు న్నాడు' అనిపించింది. అదే అదనుగా 'నా ఆలోచనలు - ఆదర్శ జీవనం' గురించి సూక్తులు, సామెతలు జోడించి చక్కగా హితోపదేశం చేశాను. తప్పకుండా అది అతనికి ఎంతో ప్రేరణనిచ్చి ఉంటుందని నమ్మ కంతో అతని ప్రతి స్పందన కోసం చూశాను.

''సార్! మీరు పెద్దవాళ్ళు. క్రమశిక్షణతో జీవితం గడు పుతున్న వాళ్ళు. నా ఆలోచనలు చాలా పరిమితమైనవి. ఈ సుఖం, సౌకర్యం, ఆనందం, భోగం... అన్నీ క్షణికమై నవేనని నాకనిపిస్తుంది. ఈ జీవితాన్ని సుఖం కోసం ఖర్చు చేయడం కంటె, ఏదైనా సాధించేందుకు ఒక పని ముట్టుగా ఉపయోగించు కోవాలని నాకనిపిస్తుంది...'' అని సెలవు తీసుకున్నాడు.

మల్లికార్జున్ మాటలు క్రమంగా అర్థమవుతూంటే నా ఆదర్శ జీవనం, టిక్ చేసుకున్న అంశాలు చాలా అల్పమైనవిగా అనిపించసాగాయి. ❑

*రచయిత సెల్ నెం: 9866 251679*